క్లుప్తంగా

పకడ్బందీగా భూ రీసర్వే



కొండజుటూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్

పాణ్యం: మండలంలోని కొండజుటూరు గ్రామంలో చేపడుతున్న రీ సర్వేపై రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని ఆర్బీకేలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. తప్పనిసరిగా ఒక రోజు ముందు రైతులకు నోటీసులు, సమాచారం అందించాలన్నారు. వారి సమక్షంలో రీసర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, వీఆర్ఓ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల రిలే దీక్షలు

కర్నూలు(సెంట్రల్) : పాత పెన్షన్ కోసం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మద్దతు ప్రకటించి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం కొనసాగించాలన్నారు. జీపీఎస్‌కు ఎవరూ ఒప్పుకోరని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(హాస్పిటల్): స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్సీయూ)లో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎన్సీయూతో పాటు పోషకాహార పునరావాస కేంద్రాన్ని (ఎన్ఆర్సీ) తనిఖీ చేశారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి



పండ్ల తోటలను పరిశీలిస్తున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్

పాణ్యం: పండ్ల తోటల సాగును మరింత ప్రోత్సహించాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పాణ్యంలో ఉపాధి పనులు, పండ్ల తోటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద రైతులు పండ్ల తోటలు సాగు చేసుకునేలా చూడాలన్నారు. రాయితీలు అందజేస్తామన్నారు. ఉద్యాన పంటల ద్వారా లాభాలు కూడా అధికంగా ఉంటాయన్నారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీలు సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఓ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ అర్హులకు జగనన్న ప్రోత్సాహకాలు

కర్నూలు (అర్బన్): యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనులైన వారికి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద నగదును అందించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీ దేవి తెలిపారు. జీఓ ఎంఎస్ నంబర్ 58 ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా, విద్య పరంగా ఆయా వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తును నమోదు చేసి నవంబర్ 4వ తేదీ లోగా పంపాలని ఆమె కోరారు. ఇందుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారని జేడీ వెల్లడించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల స్పందనలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదన రావు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉద్యోగుల స్పందనలో ఉద్యోగుల నుంచి జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితో కలసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే కారణాలు అర్జీదారుడికి చెప్పాలన్నారు. కాగా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో చర్యలు తీసుకోవడానికి వీలు లేకపోతే రాష్ట్ర స్థాయి అధికారులకు పంపవచ్చాన్నారు. అయితే ఆర్థికేతర కారణాలతో కూడిన అర్జీలను కచ్చితంగా పరిష్కరించేందుకు వీలు ఉంటుందన్నారు. గతంలో ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరేందుకు ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ప్రతినెలా మూడో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో ఇబ్బంది లేకుండా ఉందన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 21వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో అందిస్తున్న సేవలను, కల్పించిన వసతులను ఎమ్మెల్యే పరిశీలించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్య, వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ రెండు ప్రజలకు ఉచితంగా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో నెలలో రెండు సార్లు ఇంటి దగ్గరకు డాక్టర్లు వచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఊరూరా ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అరుణ, నాయకులు బాలచంద్రరెడ్డి, సుకుమార్, ధర్మ, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో.. వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఉచితంగా వైద్య సేవలు

పాణ్యం: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తుందని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. శుక్రవారం సచివాలయం-3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్ రెడ్డి, డాక్టర్ సునీతా తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కర్నూలు (న్యూటౌన్): ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని బి. తాండ్రపాడు సచివాలయ కన్వీనర్ పెరపోగు మోహన్‌బాబు అన్నారు. శుక్రవారం ఆ గ్రామ పరిధిలోని కాదాంబరిలో నిర్వహించిన మెడికల్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో వైద్యులు పేద ప్రజలకు 7 రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు చంద్ర, సలీం, నరేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దనే ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కాగా వర్కూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపునకు ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. సుమారు 350మందికిపైగా ప్రజలు తరలివచ్చి తమ ఆరోగ్య స్థితిగతులపై వివిధ రకాల పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు.



పాణ్యంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ



బి. తాండ్రపాడులో వృద్ధుడికి కంటి అద్దాలు అందజేస్తున్న దృశ్యం



వర్కూరులో కంటిఅద్దాలు అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు

- కల్లూరు పీఏసీఎస్ కాంపౌండ్‌వాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(అగ్రికల్చర్)/కల్లూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో కలసి ప్రారంభించి సొసైటీ స్థలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కల్లూరు పీఏసీఎస్‌కు దాదాపు 30 సెంట్ల విలువైన స్థలం ఉందని, దీనిని ఖాళీగా ఉంచకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫంక్షన్ హాల్ లేదా గోదాము వంటి నిర్మాణాలు చేపడితే పీఏసీఎస్‌కు లాభసాటిగా ఉంటుందని తెలిపారు. రైతుల అభ్యున్నతికే సొసైటీలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వం సొసైటీలను మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉందన్నారు. కల్లూరు పీఏసీఎస్ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ.... ప్రతి పీఏసీఎస్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డీసీసీబీ ప్రత్యేక చొరవ తీసుకుంటోందని చెప్పారు. కల్లూరు పీఏసీఎస్‌కు సంబంధించిన ఖాళీ స్థలం అభివృద్ధికి డీసీసీబీ సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుకా రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకట రమణారెడ్డి, జిల్లా సహకార అధికారి ఎస్. రామాంజనేయులు, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహకార అధికారి నాగరమణయ్య, డీసీసీబీ డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, కల్లూరు సొసైటీ సీఈఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలతో అధిక దిగుబడి

సి.బెళగల్: రైతులు వరి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలం పరిధిలోని గుండ్రేవుల, కొండాపురం గ్రామాల్లో గ్యాప్ (జీఏపీ - గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా వరి పొలాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు వరి పంట సాగువిధానంపై అవగాహన కల్పించారు. పెట్టు బడిలేని ప్రకృతి వ్యవసాయ (జెడ్ బీఎన్ఎఫ్ - జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతులను తెలియజేశారు.అనంతరం ఏఓ మాట్లాడుతూ వరిలో దోమల నివారణకు, మిత్ర పురుగులు, శత్రు పురుగుల గుర్తింపునకు చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. రసానిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అంతకుముందు వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు, వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి పొలాల్లో వరి నాటు వేశారు.



గుండ్రేవులలో రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గిరిజన ఉద్యోగుల హక్కులను కాపాడుకుందాం

కర్నూలు (న్యూటౌన్): గిరిజన ఉద్యోగుల హక్కులను కాపాడుకుందామని ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బి.మద్దిలేటి అధ్యక్షతన గిరిజన ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధనకై నవంబర్ 12వ తేదీన విశాఖపట్టణంలో, 19వ తేదీన విజయవాడలో, 26వ తేదీన కర్నూలులో ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ కమిటీ అధ్యక్షుడు పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈసదస్సులకు గిరిజన ఉద్యోగులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రామునాయక్, రాష్ట్ర కోశాధికారి జి. వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, రమేష్, బి. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ మీటర్లకు పీస్ రేటు విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు.

క్రైం కార్నర్

తప్పిన ప్రమాదం

- కరెంట్ తీగలు తగిలి ముగ్గురికి గాయాలు...

కోడుమూరు: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తూ కరెంటు తీగలు తాకి తండ్రి, కుమారుడు, కుమార్తె గాయపడ్డారు. శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లెకు చెందిన మధు తన కుమారుడు చందు, కుమార్తె అఖిలతో కలిసి పొలానికి వెళ్లి అక్కడ వేరుశనగ కట్టెను ఎద్దుల బండిపై వేసుకుని ఇంటికి వస్తున్నాడు. రస్తాలో వారికి కరెంట్ తీగలు తాకడంతో ముగ్గురు తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని గాయపడ్డ వారిని పరామర్శించారు.

ఈరోజు

ప్రత్యేక విద్యుత్ అదాలత్

కర్నూలు (రాజ్‌విహార్) : వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు శనివారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విద్యుత్ అదాలత్‌లో సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

సల్కాపురంలో వైద్య శిబిరం

కల్లూరు: సల్కాపురం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్ లేట్లు అందజేశారు. గ్రామంలోని రైతులు పొలాల్లో బోర్లు వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే జలజీవన్ మిషన్ కింద ఉచితంగా బోర్లు వేయిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజల అభ్యున్నతి సీఎం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. లంచాలకు, వివక్షకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందజేస్తున్నారన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

నాయకులకు అభినందన...

మండల పరిధిలోని మంచాలకట్ట, గని గ్రామాల్లో పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షాలు లేకపోవడంతో పార్టీ నాయకులు శివానందరెడ్డి, మేఘనాథ రెడ్డి సొంత నిధులతో ఎస్సార్బీసీకి మోటార్లు ఏర్పాటు చేసి ఆయకట్టు కాలువకు సాగునీరు అందించారు. ఆ మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.బి. చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏపీఎం హజరత్, సర్పంచ్ అంజనమ్మ, రామ్మోహన్ రెడ్డి, నాగేశ్వ రెడ్డి, వైఎస్సార్సీపీ రాంభూపాల్ రెడ్డి, చంద్రమౌళీశ్వర్ రెడ్డి, దేశం నాగేశ్వరరెడ్డి, రఘుమాధవరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, మేఘనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రమేష్, రవీంద్రారెడ్డి, బాలచెన్ని పాల్గొన్నారు.



బొల్లవరం గ్రామంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్) : నగరంలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక నగరంలోని బుధవారపేటలోని 36, 37 సచివాలయాల పరిధిలో నగరపాలక మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. నిలువ ఉన్న నీటిని తొలగించి పిచికారీ చేశారు. క్రైస్తవ శ్మశాన వాటిక, చర్చి లైన్, ముస్లిం ఏరియా, మాలగేరి, హిందూ శ్మశాన వాటిక, విరుపాక్షయ్య తోట ప్రాంతాల్లో డెంగీ, మలేరియా వ్యాధులపై స్థానిక కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు.





కోడుమూరులో సరస్వతీదేవి అలంకరణలో శ్రీవల్లెలాంబదేవి, గూడూరులో అమ్మవారి అలంకరణ, పాణ్యంలో సరస్వతీదేవిగా ..



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో..



కె. నాగలాపురంలో ..

దేవీ.. దీవించు

- భక్తిశ్రద్ధలతో దేవీనవరాత్రోత్సవాలు
- శ్రీవల్లెలాంబదేవి సన్నిధిలో కుడా చైర్మన్ దంపతులు పూజలు



సి.బెళగల్‌లో సరస్వతీమాతగా..



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..

కోడుమూరు/గూడూరు/సి. బెళగల్/పాణ్యం: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో మూల విరాట్‌ను పసుపు, గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కోడుమూరు పట్టణంలోని శ్రీవల్లెలా ంబదేవి, శ్రీచౌడేశ్వరీ దేవి, శ్రీకాళికామాతా, శ్రీరాములమ్మ, శ్రీతులజా భవాని, శ్రీఅంబా భవాని దేవాలయాల్లో అమ్మవారు శ్రీసరస్వతి దేవి, శ్రీమహాలక్ష్ములుగా దర్శనమిచ్చారు. శ్రీవల్లెలాంబదేవికి కోడుమూ రు గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఆంధ్రయ్య దంపతు లు, పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్, పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామ పంచాయతీ తరఫున సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.




శ్రీవల్లెలాంబదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, అమ్మవారికి సారె సమర్పిస్తున్న గ్రామ సర్పంచు భాగ్యరత్న

కుడా చైర్మన్ కోట్ల హర్ష పూజలు

శ్రీసరస్వతి దేవిగా దర్శనమిచ్చిన కోడుమూరులోని శ్రీవల్లెలాంబదేవికి శుక్రవారం రాత్రి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.

- గూడూరులోని అంబాభవానీ మాత భక్తులకు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.
- మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఈశ్వరాలయంలో దుర్గా అమ్మవారు, అదేవిధంగా పాత బస్టాండ్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవారు చదువులతల్లిగా దర్శనమిచ్చారు.
- పాణ్యంలో దేవదాయశాఖ అధికారులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారిని నిర్వాహకులు పుస్తకాలు, పెన్నులు, పలకలతో అలంకరించారు.

గడివేముల: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం గడివేములలో కన్యకా పరమేశ్వరి ఆలయంలోని వాసవి మాత సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.